క్లుప్తంగా

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం అందజేత



సైదాకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు షేక్ సైదా ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయమై ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. శనివారం తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు వెలది వెంకటప్పాచారి, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి మురళి, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, సహాయ కార్యదర్శులు నాయిని అంజయ్య, సైదిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఖాజామోయినుద్దీన్, జిల్లా నాయకులు సరికొండ నాగరాజు, లింగయ్య, అశోక్, మహేష్, బుర్రి శ్రీను, బంగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ కనబరిచిన లక్ష్మీప్రసన్నకు పురస్కారం



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నర్సింహారెడ్డి

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని రామలక్ష్మీపురంనకు చెందిన పేదింటి బిడ్డ మావునూరి లక్ష్మీప్రసన్న ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ మార్కులు సాధించింది. దీంతో శనివారం గ్రామంలో ప్రతిభా పురస్కారాల చైర్మన్ అన్నెం నర్సింహారెడ్డి- స్రవంతి దంపతులు ఆ విద్యార్థినికి అవార్డు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. ఇంటర్‌లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు సాధించాలని, ఉన్నత చదువుల కోసం తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నెం పాపిరెడ్డి, వీరబాబు, భాస్కర్, రామయ్య, సీతయ్య, కొండలు, శ్రీను, ఆశీర్వాదం ఉన్నారు.

బూరుగడ్డ ఆలయంలో సహస్రనామ పుష్పార్చన




పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్రనామ ఫల పుష్పార్చనను అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ పుష్పార్చన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

అతుల్‌కుమార్ అంజన్ మృతికి సంతాపం

చిలుకూరు : సీపీఐ, కిసాన్ సభ జాతీయ నాయకుడు అతుల్‌కుమార్ అంజన్ మృతి పట్ల శనివారం చిలుకూరులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతు సంఘం జాతీయ నాయకుడిగా రైతులకు ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, మండల అధ్యక్షుడు ముక్కా వీరబాబు, జిల్లా, మండల నాయకులు పిల్లుట్ల కనకారావు, జిల్లా శ్రీను, మేకపోతుల అంజయ్య, సిరాపురపు వెంకన్న, చిలువేరు సిద్ధార్థ, కొండా శివ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు సామ్యేలు మృతి



సామ్యేలు (ఫైల్)

నడిగూడెం : మండలంలోని చాకిరాల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కొత్తపల్లి సామ్యేలు (65) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఏనుగుల వీరాంజనేయులు, కొరట్ల శ్రీనివాస్, కాసాని కిషోర్, మల్లెల వెంకన్న, కృష్ణసాగర్, వీరబాబు, మోహన్‌రావు తదితరులులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాలుగేళ్లుగా పిల్లర్ల దశలోనే..

- అసంపూర్తిగా చిలుకూరు పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు
- నిధులు విడుదల కాకపోవడంతో నిలిపివేసిన కాంట్రాక్టర్లు



చిలుకూరులో అసంపూర్తిగా నిలిచిన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం

చిలుకూరు : చిలుకూరు పోలీస్‌స్టేషన్ పక్కా భవన నిర్మాణ పనులు నాలుగేళ్ల క్రితం అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాటి నుంచి పనులపై దృష్టి పెట్టిన నాథుడే కరువయ్యారు. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు ఆపివేసినట్లు తెలుస్తోంది. అయితే పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి 22 ఏళ్ల క్రితమే స్థలం కేటాయించారు. భవన నిర్మాణానికి దాదాపు ఏడేళ్ల క్రితం పోలీస్ శాఖ నుంచి రూ. 1.30 లక్షలు మంజూరయ్యాయి. దీంతో నిధులు మంజూరైన మొదట్లో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ గుంతల దశలోనే కొద్ది రోజులకే పనులు నిలిపివేశారు. ఇక రెండేళ్ల వరకు పనులను పట్టించుకోలేదు. పలుమార్లు ఎస్పీ స్థాయి అధికారులు పరిశీలించి తిరిగి రీటెండర్ వేశారు. దీంతో చిలుకూరు మండలానికి చెందిన కాంట్రాక్టర్ టెండర్‌ను దక్కించుకొని తిరిగి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్, పిల్లర్ల నిర్మాణం వరకు పూర్తిచేసి అతను కూడా పనులను నిలిపివేశాడు. దీంతో పనులు ఆగిపోయి నాలుగేళ్లు కావస్తోంది.

2009లో భూమి కేటాయింపు..

కాగా, 2009లో జన్మభూమి సమయంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటుకు చిలుకూరులో సుమారుగా 3 ఎకరాల భూమిని కేటాయించారు. ఒకే దగ్గర అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు నిర్మించారు. క్రమక్రమంగా ఉపాధి హామీ, స్త్రీ శక్తి భవనం, వ్యవసాయ శాఖ కార్యాలయం ఆ తరువాత గృహ నిర్మాణ శాఖ భవనాలు నిర్మించారు. కానీ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం ఒక్కటే ఆగిపోయింది. దీంతో నాలుగేళ్ల క్రితం వరకు పోలీస్‌స్టేషన్‌ను బస్టాండ్ సెంటర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో గృహ నిర్మాణ శాఖ భవనానికి మార్చారు. కానీ పక్కా భవనం లేకపోవడంతో అసౌకర్యంగా ఉందని, నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలని పలువురు పోలీస్ సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు రజకులు అండగా నిలవాలి

- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : రజకులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌ను రజకులు తెలంగాణ రజక సంఘం జాతీయ కోఆర్డినేటర్ కొల్లూరు మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎన్నికల కోడ్ ముగిసాక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మంత్రి కోరారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మద్దతు ఇస్తామని రజక సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్తయ్య, దుగ్గి వర్మ, చిక్కుళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది

- నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : బీజేపీపై ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కాషాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సైదిరెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పదేళ్ల పరిపాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారని అన్నారు. మరోసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆయన పేర్కొన్నారు. బీజేపీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి గుడెపు దీప, బూరుగడ్డ గ్రామానికి చెందిన మద్దుల కనకయ్య, గువ్వల అయోధ్య, తాళ్ల వెంకయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుందూరు కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్పన్నపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం



ముస్తాబైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి అలహరి నరసింహాచార్యులు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కల్యాణానికి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రతి ఏటా గ్రామస్తుల సహకారంతో ఈ కల్యాణం జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కల్యాణోత్సవానికి సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. కాగా, అప్పన్నపేటలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఘన చరిత్ర ఉన్నది. కాకతీయుల కాలంలో ఆలయం నిర్మించినట్లు స్థానికులు చెబుతుంటారు. స్వామివారికి మాంసాహారం నైవేద్యంగా సమర్పించడం ఇక్కడి ఆచారం.

కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి

గరిడేపల్లి : ఎండలు మండిపోతున్నందున ఉపాధి హామీ పనుల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వడదెబ్బకు అనేకమంది ఉపాధి హామీ కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారని, కావున ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

అమరుల త్యాగం వృథా కాదు

గరిడేపల్లి : అమరుల త్యాగం వృథా కాదని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. శనివారం గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్వహించిన స్వాతంత్ర్య సమరయోధులు అందె నర్సయ్య, సుందరి బసవయ్య 45వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నందిపాటి మట్టయ్య, చామకూరి వెంకటప్పయ్య, ఎస్‌కె మన్సూర్, మండవ సైదులు, తిరపయ్య, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయం



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

కోదాడరూరల్ : పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాదర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గణపవరం, రామలక్ష్మీపురం, బీక్యాతండాలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేవిధంగా నాయకులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా రామలక్ష్మీపురంలో బీఆర్‌ఎస్‌కు చెందిన 30 మంది నాయకులు కొప్పుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, అన్నపూర్ణ, అమరనాయిని వెంకటేశ్వరరావు, వెంటాచారి, చిట్టా రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కొప్పుల శ్రీనివాసరెడ్డి, సాగర్‌రెడ్డి, నాగప్రసాద్, నాన్‌రాజ్, అంబేద్కర్ తదితరులు ఉన్నారు.

వరికొయ్యలకు నిప్పు.. కాలిపోయిన హరితహారం చెట్లు

చిలుకూరు : మండలంలోని బేతవోలు రోడ్డులో నరసింహస్వామి ఆలయం సమీపంలో పలువురు రైతులు వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో రోడ్డు వెంట ఉన్న హరితహారం చెట్లకు మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయాయి. మంటలు పెద్దఎత్తున చెలరేగడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. కాగా, వరికొయ్యలకు నిప్పు పెట్టవద్దని వ్యవసాయ అధికారులు పదేపదే చెబుతున్నా రైతులు వినిపించుకోకపోవడంతో పొలాల వద్ద ఉన్న వ్యవసాయ మోటార్లు, వైర్లు, పైపులైన్లు కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

బీజేపీవి మతోన్మాద రాజకీయాలు



గరిడేపల్లి : వెలిదండలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడరూరల్ : మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పారసీతయ్యలు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగినదేమీ లేదని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలు, జుట్టుకొండ బసవయ్య, బెల్లంకొండ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్‌లు యాదగిరి, షాబుద్దీన్, సూర్యనారాయణ, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

గరిడేపల్లి : దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో నిర్వహించిన ప్రపంచ కార్మికుల వారోత్సవాల్లో ఆయన పాల్గొని సీపీఎం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు యానాల సోమయ్య, అంబటి భిక్షం, కాశయ్య, సైదులు, యానాల రామారావు, గోపి, భిక్షం, పుట్టల లక్ష్మయ్య, సైదులు, వెంకన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మునగాల : ఇండియా కూటమి అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. శనివారం మునగాల మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శి నందిగామ సైదులు, మాజీ ఉప సర్పంచ్ రావులపెంట వెంకన్న, నాయకులు నిడిగొండ శంభయ్య, ములకలపల్లి సైదులు, నాగరాజు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వట్టెపు చినసైదులు, గురుమూర్తి, ఇంటూరి హుస్సేన్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న కేఎల్‌ఎన్ ప్రసాద్, భక్తులు

మేళ్లచెరువు : మండలంలోని వెల్లటూరు గ్రామంలో కంఠమహేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ గౌడ్, అంతయ్యగౌడ్, సైదులు, నాగరాజు, శ్రీనివాస్, వీరాంజనేయులు, కొండలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్



మోతె : రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు


మోతె : పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు కోరారు. శనివారం మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసుదన్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కారింగుల సత్యనారాయణ, కారింగుల శ్రీనివాస్, సైదా, సామ ప్రభాకర్‌రెడ్డి, రవి, రాముడు, భద్రయ్య, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని గెలిపించాలి


కోదాడరూరల్ : పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండానే ఓట్లు అడుగుతుందని విమర్శించారు. ఐదెకరాలు భూమి ఉన్న రైతులకు ఇంతవరకు రైతు బంధు పడలేదని అన్నారు. కార్యక్రమంలో అన్నెం వెంకట్‌రెడ్డి, ఉద్దండు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

నడిగూడెం : నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దున్నా సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్, నాయకులు బొల్లం శ్రీను, ఎండి.జలీల్, దున్నా రవి, కన్నెబోయిన మురళి, తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెంలో..



కోదాడరూరల్ : బీక్యాతండాలో

బంగారం, నగదు చోరీ

మఠంపల్లి: మండల కేంద్రమైన మఠంపల్లి మెయిన్ రోడ్డులో గల కిరాణాదుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన వెచ్చా వెంకటేశ్వర్లు నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఒంగోలులోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. వారు శనివారం వచ్చి చూసేసరికి ఆయన కిరాణాదుకాణం గది తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని 12 తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈవిషయమై మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

వివాహిత అదృశ్యం

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలో వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన నూకపంగు మంగమ్మ తన కుమార్తె త్రివేణిని (20) ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం వల్లభి గ్రామానికి చెందిన సురేపల్లి ఉపేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి కుమార్తె పూజ ఉంది. పూజకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో త్రివేణి పది రోజుల క్రితం బూరుగడ్డలో తన తల్లిగారి ఇంటికి వచ్చింది. గత నెల 28న త్రివేణి తన కుమార్తెను తీసుకుని పాల ప్యాకెట్ తెస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కృష్ణారెడ్డి

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన 60 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తాజా మాజీ సర్పంచ్ నంద్యాల విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఎలక కవిత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కోదాడలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి పద్మావతి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుర్రం లింగారెడ్డి, కుంభం భిక్షం, కాటేపల్లి లింగయ్య, పార్టీ కార్యదర్శి తాళ్లూరి ఎల్లయ్య, వార్డు సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి, ఎలక సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఉప సర్పంచ్..

కోదండరామాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు, తాజా మాజీ ఉప సర్పంచ్ సుంకి కృష్ణారెడ్డి శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాధవగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏఎస్ఐ

చిలుకూరు : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వసతులు కల్పించాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని మాధవగూడెం, రామ్‌చంద్రానగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, కరెంట్, మరుగు దొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద రోప్స్ ఏర్పాటు చేయాలని, దివ్యాంగులైన ఓటర్లకు ట్రై సైకిళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కవితారెడ్డి, రాముడు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న వ్యక్తికి సీఐ అభినందన

సూర్యాపేట : కారులో మరిచిపోయిన లగేజ్‌తో పాటు బంగారు ఆభరణాలను నిజాయితీగా తెచ్చి బాధితులకు అప్పగించిన ఓ యువకుడిని పట్టణ సీఐ రాజశేఖర్ శనివారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అభినందించారు. హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు నవీన్‌కు చెందిన కారులో సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ ఇద్దరు మహిళలు ఎక్కారు. సూర్యాపేటలో దిగాక కారులో లగేజ్ మరిచిపోయారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కారు డ్రైవర్ నవీన్ కారులో మరిచిపోయిన లగేజ్, బంగారం ఆభరణాలను తెచ్చి సీఐకి అందజేశారు. వెంటనే సీఐ బాధితులను పిలిచి వాటిని అప్పగించారు. నిజాయితీ చాటుకున్న నవీన్‌ను సీఐ అభినందించారు. ఆయన వెంట సిబ్బంది కర్ణాకర్, కృష్ణ, ఆనంద్, సైదులు, మధు తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు

కోదాడరూరల్ : ఓటు వజ్రాయుధమని, ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దని మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలో ఓటు హక్కు వినియోగంపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు నిర్వహించిన కళాజాత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును విధిగా వినయోగించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా కళాకారులు పాటల ద్వారా ఓటు విలువను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పల్లెల లక్ష్మణ్, పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, మేడిపల్లి వేణు, గజ్జి మంజుల, ప్రియాంక, స్రవంతి తదితరులు ఉన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



గోపతండాలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మోతె : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం మోతె మండలంలోని గోపతండా, నేరడవాయి గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మాట్లాడారు. మండలంలో సాగు నీటి సమస్య పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

నడిగూడెం : పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని మండల ఎన్నికల ఇన్‌చార్జ్ బండారు కవిత కోరారు. శనివారం నడిగూడెం మండలంలోని వల్లాపురంలో నిర్వహించిన ఆ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, మండల ఉపాధ్యక్షుడు లతీఫ్, ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, బండారు శోభారాణి, చిలక బాలకృష్ణ, ఉదయ్‌కిరణ్, నాగమణి, భిక్షారెడ్డి, సైదిరెడ్డి, నూకపంగు గుర్వయ్య పాల్గొన్నారు.

హోం ఓటింగ్ సద్వినియోగం

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో 85 సంవత్సరాలు పైబడిన తొమ్మిది మంది వృద్ధులు శనివారం హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నట్లు తహసీల్దార్ హేమామాలిని విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలింగ్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఓటు వేసిన వయోవృద్ధురాలు

అనంతగిరి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అమీనాబాద్‌లో 95 ఏళ్ల వయోవృద్ధురాలు పాయిలి రామాంజమ్మ, కిష్టాపురంనకు చెందిన నర్సమ్మతో పాటు వయోవృద్ధుడు బుడిగె రంగయ్య పోస్టల్ బ్యాలెట్ ద్వారా శనివారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

భానుపురి : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీష్ రెడ్డి సతీమణి సునీత విమర్శించారు. శనివారం నల్లగొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా పట్టణంలోని 41, 45వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అబద్ధాలు ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సతీమణి సునీత